క్లుప్తంగా

ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనం

ఒంగోలు మెట్రో: స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఈ నెల 8వ తేదీ నుంచి రెండు రోజుల పాటు మహాశివరాత్రి సందర్భంగా ఈశ్వరీయ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనం, అమరనాథ్ మంచు లింగానికి క్షీరాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీల ర్యాలీ



రాచవారిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లతో సర్పంచ్ నాగమల్లీశ్వరి

మద్దిపాడు: ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని రాచవారిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్లు గ్రామ సర్పంచ్ నాగమల్లీశ్వరి ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు ఇంటి బయట కీలకంగా వ్యవహరిస్తున్నారని, ఈ మార్పు ఇంతటితో ఆగిపోగదని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

పేస్‌లో ముగిసిన శిక్షణ

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో డిజైన్ థింకింగ్ ఫర్ ప్రాబ్లమ్ సాల్వింగ్ అనే అంశంపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేఎల్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.వెంకట రమణ మాట్లాడుతూ సమస్యను గుర్తించడం ఎలా, దానిని అధ్యయనం చేసి ఐడియాను ఎలా రాబట్టాలి, వచ్చిన ఆలోచనను ఎలా పరిష్కరించాలి, వివిధ రకాల పద్ధతులను మార్కెట్‌లోకి ఎలా తీసుకుపోవాలి అనే దానిపై కూలంకషంగా మాట్లాడారు. ప్రొఫెసర్ జానకీరామ్ మాట్లాడుతూ ఉత్పత్తిని ఎలా పరీక్షించాలి, పరీక్షించిన ఉత్పత్తిని మార్కెట్‌లోకి తీసుకుపోవడం ఎలా, అన్ని వర్గాలను తృప్తి పరిచే విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి పాల్గొని శిక్షకులను అభినందించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు: శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రైజ్ కాలేజీ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. బుధవారం స్థానిక రైజ్ కాలేజీలో ఈసీఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఏఆర్‌యూడీయూఐఎన్‌వో అనే అంశంపై నరేష్ టెక్నాలజీ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ డైరెక్టర్, సీనియర్ ట్రైనర్ అయిన డాక్టర్ ఎస్‌వీ నరేష్ అవగాహన కల్పించారు. గృహ ఆటోమేషన్ సిస్టంలో ఏఆర్‌డీయూఐఎన్‌ఓ ఉపయోగాలైన లైటింగ్, ఉష్ణోగ్రత నియంత్రణ, స్వయంచాలక భద్రత వ్యవస్థలు, శక్తి నిర్వహణ, సాధారణ లైన్ ఫాలోయింగ్ రోబోట్, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ ఆన్ అండ్ ఆఫ్, సెన్సార్ల అగ్నిని గుర్తించడం, గ్యాస్ లీకేజీని గుర్తించడం, దూరాన్ని కొలవడం, నీటి స్థాయిని కొలవడం, తేమశాతాన్ని గుర్తించడం, బ్లూటూత్ కారు డ్రైవింగ్ వంటి పలు అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్ పాల్గొని విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

గ్రేడింగ్‌లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఒంగోలు సెంట్రల్: పొగాకు గ్రేడింగ్‌లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఒంగోలు–1 వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ సూచించారు. వెంకటరాజుపాలెంలో బుధవారం పొగాకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2023–24 సంవత్సర పంట కాలంలో వెంకటరాజుపాలెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రేడింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఐటీసీ మేనేజర్ వెంకటేష్, పీఎస్‌ఎస్‌హెచ్ మేనేజర్ రామాంజనేయులు, జీపీఐ మేనేజర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు విత్తనాలను పరిశీలించిన సీటీఆర్ఐ డైరెక్టర్



వితలాపురంలో రైతులతో మాట్లాడుతున్న సీటీఆర్ఐ డైరెక్టర్ శేషు మాధవ్

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో పలు గ్రామాల్లో పొగాకు విత్తనాలను సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీటీఆర్ఐ) బృందం బుధవారం పరిశీలించారు. జిల్లాలో సీటీఆర్ఐ ఆధ్వర్యంలో విత్తనోత్పత్తికి పలు గ్రామాల్లో 150 ఎకరాల వరకు రైతులతో ఒప్పందం చేసుకుని అందుకు కావాల్సిన విత్తనాలను, గ్రోయింగ్ మందులను అందించారు. జిల్లాలో వితలాపురం, చంద్రపాడు, కందులూరు గ్రామాల్లో పలు తోటలను పరిశీలించి నాణ్యమైన విత్తనోత్పత్తికి రైతులు చేసిన కృషిని, పాటించిన పద్ధతులను సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్, హెడ్ డాక్టర్ ఎం అనురాధ, శాస్త్రవేత్త గంగాధర్ తెలుసుకున్నారు. సాంకేతిక సిబ్బంది లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తా

- పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- నగరంలోని 9 డివిజన్లలో ముమ్మరంగా పట్టాల పంపిణీ
- పాల్గొన్న బాలినేని సతీమణి శచీదేవి, కుమారుడు ప్రణీత్‌రెడ్డి, కోడలు శ్రీకావ్య



22వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో సొంతిల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం పట్టా అందజేసి ఇల్లు కూడా నిర్మించి ఇవ్వడమే తన ధ్యేయమని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని 9 డివిజన్లలో లబ్ధిదారులకు బుధవారం బాలినేని, ఆయన కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఇళ్ల స్థల పట్టాలు, నూతన దుస్తులు పంపిణీ చేశారు. 19, 31, 32, 33, 45, 49 డివిజన్లలో బాలినేని సతీమణి శచీదేవి, కుమారుడు ప్రణీత్‌రెడ్డి, కోడలు శ్రీకావ్య, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ జశ్వంతరావు, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పాల్గొని పట్టాలు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసేందుకు దోర్నాల రాగా, ఆ కార్యక్రమంలో పాల్గొనడానికి బాలినేని శ్రీనివాసరెడ్డి వెళ్లారు. నిరుపేదల పట్టాల పంపిణీ ఆగకూడదని బాలినేని కుటుంబ సభ్యులు ఉదయం నుంచి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం కార్యక్రమం ముగించుకుని సాయంత్రానికి ఒంగోలు చేరుకున్న ఎమ్మెల్యే బాలినేని స్థానిక 22, 25, 26 డివిజన్లలో నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో ఇళ్లు లేని నిరుపేదలంటే తన కుటుంబ సభ్యులు కూడా ఎంతో ఆప్యాయంగా చూస్తూ పట్టాలు పంపిణీ చేస్తున్నారన్నారు. అందుకే తాను లేకపోయినా పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేంత వరకు నిర్వహిస్తున్నారన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థల పట్టాలిస్తేనే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని తాను ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా బాలినేని గుర్తు చేశారు. రానున్న ఎన్నికలు తనకు చివరి ఎన్నికలని, అందుకోసం నియోజకవర్గ ప్రజలు ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. తనను ఐదు సార్లు ఎమ్మెల్యేగా చేసిన ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే భాగ్యంగా భావిస్తున్నానని బాలినేని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఒంగోలు నగరంలో మొత్తం 25 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మొదటిగా 21 వేల మందికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి భూ హక్కు పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా మరో 4 వేల మందికి కూడా స్థలాలు ఇచ్చేందుకు భూములు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచామన్నారు. ఏ ఒక్కరూ అధైర్యపడవద్దన్నారు. భూ హక్కు పత్రాలతో పాటు లబ్ధిదారులైన దంపతులకు దుస్తులు పెడుతున్నామన్నారు. చెప్పిన మాట ప్రకారం అందరికీ ఇళ్ల పట్టాలు అందించే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టామన్నారు. అందుకోసం రూ.233 కోట్లను ప్రభుత్వం నుంచి విడుదల చేయించుకుని మరీ రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి పట్టాలు ఇస్తున్నామని బాలినేని వివరించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్, ఆర్యవైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావు, కమిషనర్ ఎం.జశ్వంతరావు, 9 డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



31వ డివిజన్‌లో లబ్ధిదారులకు పట్టాలు, దుస్తులు అందజేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, శచీదేవి, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ జశ్వంతరావు, స్థానిక కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు



బుధవారం వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభానికి దోర్నాల వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బొకే ఇచ్చి స్వాగతం పలుకుతున్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంటా రామానాయుడు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 15 కుటుంబాలు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన మోటుమాల నాయకులు

మోటుమాల (కొత్తపట్నం): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి బుధవారం పలువురు నాయకులు చేరారు. మోటుమాల సర్పంచ్ కోడూరి గోపి ఆధ్వర్యంలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అమలు చేస్తుండటంతో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరి ఆర్థికంగా ఎదిగినట్లు తెలిపారు. అందువలనే పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో గొట్టి ఆనందరావు, మెరిగ హనుమంతరావు, మెరిగ శేషయ్య, చిక్కాల శేషయ్య, చిక్కాల రవికుమార్, మద్దా రమేష్, మద్దా కోటేశ్వరరావు, కొమరగిరి మురళి, అనవరపు కమలాకర్, జంపాని అంకమ్మరావు, కొమరగిరి వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి చక్రవర్తి, జడ సుబ్బారావు, సందుబోయిన కొండలు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మోటుమాల అధ్యక్షుడు పురిణి శ్రీనివాసరెడ్డి, జజ్జర సాంబయ్య, సచివాలయ కన్వీనర్ కోడూరి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ పురిణి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారీ శక్తి వందన్ ముగింపు కార్యక్రమం



ధ్యానం ప్రాముఖ్యతను తెలుపుతున్న స్వామీజీ

ఒంగోలు సెంట్రల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన నారీ శక్తి వందన్ ముగింపు సమావేశాన్ని బుధవారం స్థానిక గాంధీరోడ్డులోని పెండ్యాల ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. మహిళా మోర్చా ఇన్‌చార్జి తీగల సత్యవతి, ప్రధాన కార్యదర్శి బి.విజయరావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందేశం వినిపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గురూజీ నందస్వామి భారతదేశంలో మహిళల ప్రాముఖ్యత, ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. మహిళలు సంఘటిత శక్తిగా ఏర్పడిన నాడు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో బలీయమైన శక్తిగా ఎదుగుతారని చెప్పారు. మహిళా మోర్చా నాయకులు అరవిందలక్ష్మి, శుభాదేవి, లక్ష్మి, నాగవల్లి, నాగేశ్వరమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షునిగా పుత్తూరి



ఆంజనేయులును సత్కరిస్తున్న పద్మశాలీయుల సంఘ నాయకులు

చీమకుర్తి: చీమకుర్తి మెయిన్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షునిగా పుత్తూరి ఆంజనేయులును ఎన్నుకున్నారు. బుధవారం ఆంజనేయులును ఆలయ కమిటీ సభ్యులు, పద్మశాలీయుల సంఘం, మార్కండేయ యువజన సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాలకు చెందిన కడవా రామకృష్ణ, జట్ల మురళీధర్, చింతకింది అశోక్, వద్ది శంకర్, సోమా వేణు, స్థానికులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యశ్రీతో ప్రజలకు మేలు




రోగులకు మందులు అందిస్తున్న ఎంపీడీఓ శ్రీహరి

మద్దిపాడు: వేలాది రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ ఆస్పత్రుల చుట్టూ తిరగకుండా గ్రామాల్లో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఏర్పాటు చేసి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎంపీడీఓ సీహెచ్ శ్రీహరి అన్నారు. బుధవారం మండలంలోని రాచవారిపాలెం గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కార్డుపై 5 లక్షల రూపాయల వరకూ వైద్యం చేయించుకోవడానికి అవకాశం ఉండగా ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దానిని 25 లక్షల రూపాయలకు పెంచారని, అందువలన వైద్యం అందక ఎవరూ బాధపడే అవసరం లేదని అన్నారు. ముందుగా వైద్యశాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి వచ్చిన స్పెషలిస్టు డాక్టర్లు పేషంట్లను పరీక్షించారు. కార్యక్రమంలో స్పెషలిస్టు డాక్టర్లు ఆప్తాల్మిక్ డాక్టర్ మహిత, ఆర్థోపెడిక్ డాక్టర్ ఉదయ్, ఆనంద మోహన్, శ్రావణ్, గ్రామ సర్పంచ్ నాగమల్లీశ్వరి, వైద్యశాఖ సిబ్బంది, సచివాలయ కార్యదర్శి శ్రీకాంత్, సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగాలి

ఒంగోలు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం పెరగాలని, ప్రతి ఓటరూ ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం రాత్రి ప్రకాశంభవనంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) జిల్లా కార్యాచరణ ప్రణాళిక అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు వారి ఓటుహక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా వినియోగించుకునేలా విస్తృత అవగాహన కల్పించడంతో పాటు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లను ఓటుహక్కు వినియోగించుకునేలా చైతన్యపరచాలన్నారు. ఎన్నికల విధుల్లో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్‌ఓ శ్రీలత, స్వీప్ జిల్లా స్థాయి కమిటీ అధికారులు పాల్గొన్నారు.



ఆలయం ముందున్న కోనేరు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న గర్భగుడి

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ముస్తాబు చేసిన మడనూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయం



రథోత్సవం (ఫైల్)

మడనూరు (కొత్తపట్నం): జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన కొత్తపట్నం మండలం మడనూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ గంగా పర్వతివర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. ప్రతి ఏడాది ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి శచీదేవి దంపతులు, ఇతర ప్రముఖులు స్వామివారిని దర్శనం చేసుకుంటారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుంటారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలలో రోజుకో ప్రత్యేక అలంకరణతో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. వేలాది మంది భక్తులు తిరునాళ్లలో పాల్గొంటారు. ఇప్పటికే ఆలయం ముందున్న గోపురానికి మరమ్మతులు చేపట్టి రంగులు వేశారు. ప్రత్యేక పూజలు, హోమాలు, స్వామివార్లకు కల్యాణం వంటి కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాల షెడ్యూల్...

శ్రీరామలింగేశ్వరస్వామికి స్వస్తిశ్రీ చంద్రమానేన శ్రీశుభకృత్ నామ సంవత్సర మాఘ బహుళ త్రయేదశి అయిన ఈ నెల 7 నుంచి బ్రహ్మోత్సవాలు మొదలై 11వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరుగుతాయి. 7వ తేదీ రాత్రి 9 గంటలకు అంకురార్పణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 8న తెల్లవారు జామున 5 గంటలకు మహాశివరాత్రి ప్రత్యేక అభిషేకాలు, అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారికి లింగోద్భవ అభిషేకాలు నిర్వహిస్తారు. 9న ఉదయం 5 గంటలకు శ్రీరామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామిలకు కల్యాణోత్సవం జరుగుతుంది. రాత్రి 10 గంటలకు నరనంది వాహనంపై ఈతముక్కలలో గ్రామోత్సవం నిర్వహించి ఆ మరుసటిరోజు మడనూరు గ్రామంలో శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంటుంది. నాలుగు దేవుళ్లు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న తరువాత 10న సాయంత్రం అమావాస్య గడియలు తప్పించి రథోత్సవం ప్రారంభమవుతుంది. మడనూరు గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి బయలుదేరి 6 గంటలకు ఈతముక్కల గ్రామం చేరుతుంది. ఈతముక్కల గ్రామంలో నిద్రచేసి మరుసటి రోజు 11న గ్రామంలో తిరిగి, మడనూరు గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం పాదుకు చేరుతుంది. శివరాత్రి రెండు రోజులపాటు జరిగే తిరునాళ్లలో గ్రామస్తుల సహకారంతో వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తారు.

ఏర్పాట్లు పూర్తి...

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పది రోజుల నుంచి ఎండోమెంట్ ఈవో జి.రమణారెడ్డి, గ్రామ పెద్దలు బద్దేల పుల్లారెడ్డి సహకారంతో బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఆలయం చుట్టూ శుభ్రం చేసి కోనేరును స్వచ్ఛమైన నీటితో నింపారు. కోనేరు చుట్టూ, ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను శుభ్రం చేయించారు. కొన్ని విగ్రహాలకు రంగులు వేయించారు. రథాన్ని బయటకు తీసి సిద్ధం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈవో కోరారు.

కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్న మోదీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ నాయకులు

ఒంగోలు టౌన్: దేశ ప్రజల సంపదను మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మండిపడ్డారు. స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించి ఇంటికి పంపించాలని కోరుతూ ఈ నెల 14వ తేదీ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన మహా పంచాయితీని విజయవంతం చేయాలని చుండూరి పిలుపునిచ్చారు. దేశ రైతాంగానికి రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతాంగం మధ్య చీలికలు తెచ్చి ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు మోదీ సర్కార్ కుట్రలు చేస్తోందన్నారు. పంజాబ్‌కు చెందిన కొద్దిమంది రైతులను చర్చల పేరుతో పిలిచి మోసపూరితంగా వ్యవహరించిందని, చివరికి మద్దతు ధరకు చట్టబద్ధత లేదని చెప్పడంతో చర్చలకు వెళ్లిన రైతులు మహా పంచాయితీలో పాల్గొనేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు మాత్రమే చరణ్‌సింగ్, డాక్టర్ స్వామినాథన్‌లకు భారతరత్న అవార్డులు ప్రకటించారని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపి రైతుల కడుపుకొట్టేందుకు సిద్ధమైందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిపాటి వెంకటేశ్వరరావు విమర్శించారు. అన్నం పెట్టే రైతుల మీదకు తుపాకులు గురిపెట్టడం బీజేపీకే చెల్లిందన్నారు. ఏఐటీయూసీ నాయకుడు పీవీఆర్ చౌదరి, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఆర్.మోహన్, కౌలు రైతు సంఘ జిల్లా నాయకుడు వి.బాలకోటయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కె.వీరారెడ్డి, పద్మ, హనుమారెడ్డి, ప్రకాశరావు, సర్దార్, జగదీష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా హాకీ జట్టు ఎంపిక



జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

చీమకుర్తి: సీనియర్ మహిళల రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జిల్లా తరఫున పాల్గొనే జట్టును బుధవారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో ఎంపిక చేశారు. ఈ పోటీలు ఈనెల 8, 9, 10 తేదీల్లో మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులోనే జరగనున్నాయి. ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున పాల్గొనే జట్టు ఎంపిక కోసం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 40 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. వారిలో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారిణులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు హాకీ జిల్లా జట్టు అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రవికుమార్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ నుంచి ఇద్దరు సస్పెన్షన్‌కి సిఫార్సు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ నుంచి ఇద్దరిని సస్పెండ్ చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయానికి సిఫార్సు చేశారు. ఒంగోలు నగరంలోని 7వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ హజరత్‌అలీ అలియాస్ బాచి, నూర్ బాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సోఫియా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి వారిద్దరినీ సస్పెండ్ చేయాలని పార్టీ కేంద్ర కార్యాలయానికి సిఫార్సు చేశారు.